
ప్రజాశక్తి
ఆదివారం 20 ఏప్రిల్ 2025



16,347 పోస్టులను వెంటనే భర్తీచేయాలి

మంత్రికి డివైఎఫ్ఐ వినతి

విజయనగరం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్, అభ్యర్థులు కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని పోరాటం చేయడంతో 6వేల పోస్టులకు అప్పటి సిఎం జగన్మోహన్‌రెడ్డి నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. ఎన్నికలు వస్తున్న సమయంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసిందని తెలిపారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని తొలి సంతకం చేసిన ముఖ్యమంత్రి నేటివరకు పోస్టులను భర్తీ చేయలేదన్నారు. జిల్లాలోసుమారు 20వేల మంది నిరుద్యోగులు డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. వెంటనే పోస్టులు భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మురళి, నరేష్, డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు



తోటాడ ప్రీతి, 14వ ర్యాంకు
ఆలిండియా ఓపెన్ కేటగిరీ



ఆనంద్‌చక్రవర్తి, 86వ ర్యాంకు
ఆలిండియా ఓపెన్ కేటగిరీ



పి.రోహిత్, 93వ ర్యాంకు
ఆలిండియా ఓపెన్ కేటగిరీ



డి.బలరాంనాయుడు
120వ ర్యాంకు-ఒబిసి



జాగాన యోగీశ్వర్
135వ ర్యాంకు-ఒబిసి



పాలవలస పవన్‌తేజ
612వ ర్యాంకు -ఒబిసి



నందవర్ధన్ నిహాల్
137వ ర్యాంకు-ఎస్‌టి



ఎస్.అఖిల్
900వ ర్యాంకు - ఎస్‌టి

ప్రజాశక్తి-బొబ్బిలి, రామభద్రపురం, కొత్తవలస, సీతానగరం, పాలకొండ

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు. పలువురు విద్యార్థులు వందలోపు ర్యాంకు సాధించి సత్తాచాటారు. విజయనగరం జిల్లాకు చెందిన పి.శ్రీహర్ష వర్ధన్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 26వ ర్యాంకు, ఆరంగి సాత్విక్ ఓపెన్ కేటగిరిలో 271వ ర్యాంకు, ఒబిసిలో 36వ ర్యాంకు సాధించాడు. పిహెచ్‌ఎస్ సూర్య కార్తీక్ ఓపెన్ కేటగిరిలో 75వ ర్యాంకు, ఒబిసిలో 29వ ర్యాంకు, బి.మహంతి 459వ ర్యాంకు, పార్వతీపురం పట్టణానికి చెందిన ద్వారపురెడ్డి బలరాంనాయుడు 769వ ర్యాంకు, ఒబిసిలో 120వ ర్యాంకు సాధించాడు. బలరాం నాయుడు తండ్రి ద్వారపురెడ్డి తిరుపతిరావు గ్రేడ్1 కాంట్రాక్టర్ కాగా, తల్లి శకుంతల డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బొబ్బిలిలోని నాయుడు కాలనీకి చెందిన పొట్నూరు కార్తిక్ ఓపెన్ కేటగిరిలో 481వర్యాంకు, కెవి అరవింద్ కుమార్ 494వ ర్యాంకు సాధించారు.

ప్రీతికి 14వ ర్యాంకు

కొత్తవలస మండలం రాజ పాత్రునిపాలెం గ్రామానికి చెందిన తోటాడ ప్రీతి ఆలిండియా 14వ ర్యాంకు సాధించి మండలానికి మంచి పేరు తీసుకొచ్చారు. ఆమె ర్యాంకు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

ఆనంద్‌చక్రవర్తికి 86వ ర్యాంకు

బొబ్బిలికి చెందిన పిటి ఆనంద్ చక్రవర్తి 86వ ర్యాంకు సాధించాడు. రత్నాల నగర్‌లో నివాసముంటున్న పి.టీను ఆనంద్ చక్రవర్తి ఓపెన్ కేటగిరీలో 86వ ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. విశాఖలోని నారాయణ విద్యాసంస్థల్లో టెన్త్, ఇంటర్ సెంట్రల్ సిలబస్ పూర్తి చేసిన చక్రవర్తి జెఇఇ మెయిన్స్ లో ఓపెన్ కేతగిరీలో 86వ ర్యాంక్ సాధించగా ఓబిసి కోటలో 12వ ర్యాంక్ సాధించాడు. తండ్రి శ్రీనివాసరావు పారాది పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడుగా, తల్లి అనురాధ పాతపట్నం మోడల్ పాఠశాలలో గణితం ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. బొబ్బిలికి చెందిన బలగ శ్రీచరణ్ ఒబిసి కేటగిరిలో 3885వ ర్యాంకు సాధించాడు.

రోహిత్‌కు 93వ ర్యాంకు

మెయిన్స్ ఫలితాల్లో పాలకొండ మండలం అర్ధలి గ్రామానికి చెందిన పొగరి రోహిత్ ఆలిండియా స్థాయిలో 93వ ర్యాంకు సాధించాడు. విశాఖపట్నం కెఎం ఆర్ కళాశాలలో ఇంటర్ చదివి 892 మార్కులు సాధించాడు. తండ్రి వెంకటరమణ కాంట్రాక్టర్ కాగా, తల్లి రామలక్ష్మి గృహిణి.

రాజాం మండలం డోలపేటకు చెందిన పాలవలస పవన్ తేజ 99.79 పర్సంటేల్‌తో ఆలిండియా ఒబిసి కోటాలో 612వ ర్యాంకు సాధించాడు. పవన్‌తేజ తండ్రి బిలాస్‌పూర్‌లో రైల్వే లోకోపైలట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఇంటర్ విశాఖలోని ఫిట్‌జి కళాశాలలో చదువుకొని ర్యాంకు సాధించాడు. మన్యం జిల్లా సీతానగరం మండలంలోని జోగింపేటలోని ఎపిటిడబ్ల్యుఆర్ ఎక్సలెన్సుకు చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఈ కళాశాలకు చెందిన ఎస్.నందవర్ధన్ నిహాల్ 98.4 పర్సంటేల్‌తో ఎస్‌టి కేటగిరిలో 137వ ర్యాంకు సాధించాడు. ఎస్.అఖిల్ 93.15 పర్సంటేల్‌తో 900వ ర్యాంకు సాధించాడు. పార్వతీపురం జిల్లాకు చెందిన టి.మనోహర్ 328వర్యాంకు సాధించాడు.

రామభద్రపురం మండలం ఆరికతోట గ్రామానికి చెందిన జాగాన యోగీశ్వర్ ప్రతిభ కనబరిచాడు. 99.95శాతం పర్సంటేల్‌తో ఒబిసి విభాగంలో 135వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దేశానికి ఉపయోగపడేలా కృషి చేయడమే తన ధ్యేయమని ఈ సందర్భంగా యోగీశ్వర్ తెలిపారు. యోగీశ్వర్‌ను గ్రామస్తులు అభినందించారు.

మామిడి రైతులకు సహకరిస్తాం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో మామిడి పండించే రైతులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని , వారు ఎదగడానికి ఏ రకమైన సహకారం కావాలో తెలియజేయాలని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో మామిడి పంట అధికంగా పండిస్తున్నప్పటికీ ధరలు ఆశాజనకంగా ఉండడం లేదని, రైతులు నాణ్యమైన ఉత్పత్తుల కోసం మెళకువలు నేర్చుకోవాలని తెలిపారు. శనివారం స్థానిక హోటల్ లో మామిడి పండించే రైతులు, పండ్ల అమ్మకం దారులు, కొనుగోలు దారులతో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సమన్వయం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మామిడి లోని రకాలు, వాటి ఉత్పత్తి విధానం, మార్కెటింగ్, ప్యాకింగ్, రవాణా, రవాణా చేయడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాల పై రైతులకు, అమ్మకం దారులకు పవర్ పాయింట్ పై అవగాహన కలిగించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా పండించే మామిడి వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దిగుబడి తగ్గుతోందని, పూత సమయం నుండే నష్టం జరుగుతోందని, రైతులు పంటను పరిరక్షించు కోడానికి కావలసిన సాంకేతికతను కూడా తెలుసుకోవాలని, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పద్ధతులను కూడా తెలుసుకోవాలని తెలిపారు. రైతులకు ప్రోత్సహించడానికి క్లస్టర్ ఫార్మ్ ఏర్పాటు చేసి కామన్ ఫెసిలిటీ సెంటర్ యూనిట్ ను స్థాపించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఎగుమతులకు నాణ్యతే ముఖ్యం

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, అందుకోసం రైతుల్లో మార్పు రావాలని, విత్తనం నుండి పంట వరకు నాణ్యత ఉండేలా చూడాలని రాష్ట ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ తెలిపారు. రసాయనాల వినియోగం తగ్గించాలని, ప్రకతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని తెలిపారు. మహారాష్ట్ర లో పండే అల్ఫాన్సాకు మామిడి లో రారాజు గా పేరు ఉందని, మన బంగినపల్లి, సువర్ణ రేఖ రకాలు దీనికి పోటీగా తయారు కావాలని తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎంఎల్‌సి డాక్టర్ సురేష్ బాబు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామా రావు, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, ఎల్‌డిఎం మూర్తి, నాబార్డ్ డిడిఎం నాగార్జున, మార్కెటింగ్ ఎడి రవికిరణ్, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కొత్త ఆలోచనలు

- వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఆదాయం పెంచడంపై అధికంగా దృష్టి పెట్టాలి
- ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి అధికారి రాజశేఖర్
- గ్రామ స్థాయిలో సిబ్బందికీ వృద్ధిరేటు లక్ష్యాలపై అవగాహన : అహ్మద్‌బాబు



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి అధికారి రాజశేఖర్

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా కలిగి వున్న విజయనగరం వంటి జిల్లాల్లో ప్రాథమిక రంగాలైన వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక రంగాల్లో వృద్ధి సాధన ద్వారానే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల మేరకు ఏడాదికి జిల్లాలో 15శాతం వృద్ధిరేటు సాధించడం సాధ్యమవుతుందని ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి అధికారి, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 15శాతం వృద్ధిరేటు సాధించేందుకు వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా కొత్త ఆలోచనలు, ప్రయోగాలు చేయడం అవసరమన్నారు. వ్యవసాయ రంగంలో ఆదాయం పెరిగినపుడే జిల్లాలో తలసరి ఆదాయం పెరుగుతుందన్నారు. జిల్లా అధికారులు తమ శాఖల క్షేత్రస్థాయి సిబ్బందికి కూడా ఈ అంశాలపై స్పష్టమైన అవగాహన ఏర్పరచి తద్వారా లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఒక రోజు పర్యటన నిమిత్తం శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్ ఛార్జి అధికారి, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, జిల్లా ఇన్‌ఛార్జి అధికారి రాష్ట్ర పన్నుల శాఖ కమిషనర్ డాక్టర్ అహ్మద్‌బాబు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో వృద్ధి రేటు సాధనకు ఆయా శాఖల అధికారులు చేపట్టాల్సిన కార్యక్రమాలు, అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సాగులో లేని భూమి ఈ జిల్లాతో సహా రాష్ట్రం మొత్తంమీద 30 లక్షల హెక్టార్లు వుందని, దీనిని సాగులోకి తేవడం, సాగువిస్తీర్ణాన్ని పెంచడం, ఒకే పొలంలో బహుళ పంటల సాగు, వ్యవసాయ ఉత్పాదకత పెంచడం వంటి చర్యల ద్వారా వ్యవసాయ ఆదాయాన్ని పెంచేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పండించే పంటలు, కూరగాయలు, పూలు ఇతర ఉద్యాన ఉత్పత్తులకు విశాఖలో మంచి మార్కెట్ వుందని, దీనిని వినియోగించుకొనే ప్రయత్నం చేయాలన్నారు. వచ్చే జూన్‌లో కలెక్టర్‌ల సదస్సు జరిగే నాటికి వృద్ధి రేటు సాధనలో కొంతైనా పురోగతి చూపించాలన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి అధికారి డాక్టర్ అహ్మద్ బాబు మాట్లాడుతూ సూక్ష్మ స్థాయి వరకు వృద్ధిరేటు సాధన లక్ష్యాలపై తగిన అవగాహన ఏర్పరచడం ద్వారానే కిందిస్థాయి సిబ్బందిని లక్ష్యాల సాధనలో భాగస్వాములను చేయగలమని చెప్పారు. 15శాతం వృద్ధిరేటు సాధనకు మండలం, గ్రామం వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. సంపదను పెంచే కార్యక్రమాలు చేపట్టాలని తద్వారానే తలసరి ఆదాయం పెరుగుతుందన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో తగిన అవగాహన ఏర్పరచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కార్యక్రమాలు కేవలం మూడో శనివారం మాత్రమే కాకుండా నిరంతరంగా జరిగేలా చర్యలు చేపట్టాల్సి వుందని ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి అధికారి బుడితి రాజశేఖర్ అన్నారు. ప్లాస్టిక్ రహితంగా గ్రామాలు, పట్టణాలను తీర్చిదిద్దేందుకు వినూత్న ఆలోచనలు చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ముందుగా ప్రభుత్వ అధికారుల నుంచే దీనికి శ్రీకారం చుట్టాలన్నారు. జిల్లాలో 15శాతం వద్ధిరేటు సాధనకు నెలవారీ లక్ష్యాలను విధిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర స్థాయి అధికారులకు వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, సిపిఒ పి.బాలాజీ, డిఆర్ఒ ఎస్.శ్రీనివాస మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ఇది కోతల ప్రభుత్వం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వం కాదని, కోతలు ప్రభుత్వమని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సూపర్ సిక్స్ అన్నారు జనం చెవిలో పువ్వులు పెట్టారని విమర్శించారు. శనివారం జెడ్‌పి ఛాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వకపోగా ఉన్న పింఛన్లలో ప్రతినెలా కోతలు విధిస్తున్నారని అన్నారు. విజయనగరం జిల్లాకు సంబంధించి చూస్తే ప్రతినెలా 1200 నుండి 1300 వరకు పింఛన్లు తగ్గిస్తున్నారని తెలిపారు. ఉపాధి కూలీకి కనీస వేతనం 300 రూపాయలతో 100 రోజుల పని దినాలు కల్పించాలన్నది లక్ష్యం కాగా కల్పించకపోగా, 13వారాలు కావస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు ఆకలితో అలమటిస్తున్నారని అన్నారు. దీనిపై జిల్లా సర్వసభ్య సమావేశంలో జిల్లాకు చెందిన కూటమి ప్రజాప్రతినిధులను తాము ప్రతిసారి అడుగుతూనే ఉన్నామన్నారు. కానీ వారి నుండి సరైన సమాధానం రావడం లేదన్నారు. మత్స్యకారులకు ఇస్తామన్న భృతి కూడా టిడిపి ప్రభుత్వం చెల్లించలేదన్నారు. జిల్లాలో 20, 452 మంది బిసి కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు పెడితే అందులో కేవలం 3,372 మందికి మాత్రమే అవకాశం కల్పించారన్నారు. ఏ ప్రాతిపదికన అవకాశం కల్పించారని అడిగితే అధికారుల నుండి సరైన సమాధానం లేదన్నారు. పరిశ్రమలు తీసుకువస్తామని, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని కూటమి ప్రభుత్వం కూతలు కూసినా అమలు కావడం లేదన్నారు. జిల్లాలో జిందాల్ పరిశ్రమ మూతబడిందని, దీనికి కూటమి నేతలు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు సూర్యనారాయణరాజు, చిన అప్పన్న, జై హింద్ పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్మన్ వ్యాఖ్యల్లో వాస్తవం లేదు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేస్తున్న వ్యాఖ్యల్లో వాస్తవం లేదని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం తన క్యాంపుకార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జెడ్‌పి సమావేశంలో వచ్చిన చాలా ప్రశ్నలకు సమాధానం చెప్పినప్పటికీ, ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేవలం మరణించిన వారి పింఛన్లు మాత్రమే ఆపుతున్నామని, మిగిలినవారి పింఛన్లు ఒక్కటి కూడా ఆపలేదని చెప్పారు. పింఛన్లు ఎప్పటి నుంచి మంజూరు చేస్తారు? అన్న ప్రజాశక్తి ప్రశ్నకు ఆయన స్పందిస్తూ 'పింఛన్ల కోసం ప్రత్యేక బడ్జెట్‌ను ప్లాన్ చేస్తున్నాం... ఆ కసరత్తు పూర్తికాగానే అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తాం' అని సమాధానం చెప్పారు. ఉపాధి కూలీలందరికీ త్వరలోనే వేతనాలు అందుతాయని, ఇప్పటికే కేంద్రంతో సంప్రదించామని వివరించారు. అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా జాప్యం జరిగే పరిస్థితి లేకుండా నిధులు విడుదల, బిల్లుల చెల్లింపు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నిధుల మళ్లింపుతో వివిధ పనులకు సంబందించిన రూ.కోట్ల బకాయి పేరుకుపోయిందని విమర్శించారు. నియోజకవర్గానికో ఎంఎస్‌ఎంఇ పార్కును ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో అన్ని చోట్ల స్థలాలను ఇప్పటికే గుర్తించామని చెప్పారు. ఇప్పటికే ఉన్న ఎపిఐఐసి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లలో స్థలాలు ఖాళీగానే ఉన్నాయని, వాటిని ఉపయోగించకుండా కొత్తగా భూమి సేకరించడం ప్రయోజనం ఏమిటి? అని ప్రజాశక్తికి అడిగిన ప్రశ్నకు కూడా మంత్రి స్పందించారు. అవన్నీ మధ్యతరహా పరిశ్రమల కోసం ఏర్పాటు చేసినవని, ప్రత్యేకంగా ఎంఎస్ఎఇ పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా ఆయా నియోజకవర్గాలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. బిసి కార్పొరేషన్ రుణాలన్నీ పారదర్శకంగానే మంజూరు చేస్తామని చెప్పారు. ఇంకా గ్రౌండింగ్ కాకముందే అపోహలు సృష్టించడం సరికాదన్నారు. జెడ్‌పి చైర్మన్ మాటలను ప్రజలు ప్రస్తుతం నమ్మే పరిస్థితి కూడా లేదన్నారు. సిఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా క్రైస్తవులంతా ఆయన ఆరోగ్యంగా ఉండాలని, పరిపాలన మరింత బాగుండాలని కోరుతూ ప్రార్థనలు చేయాలని మంత్రి అభ్యర్థించారు.

తొలగించిన ఎండిఎం కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఎండిఎం కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం మండలం జొన్నవలస హైస్కూల్ లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగించడం అన్యాయం, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.సుధారాణి, సిఐటియు జిల్లా నాయకులు ఎ.జగన్మోహనరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎల్ బి జి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన కూటమి నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేసి, భోజనం బాగులేదని కుంటిసాకులు చెప్పి కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. కేవలం రాజకీయ వేధింపుల్లో భాగంగానే తొలగించారని అన్నారు. 17 ఏళ్ల నుంచి పని చేస్తున్న నలుగురు మహిళలను తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం సకాలంలో బడ్జెట్ ఇవ్వకపోయినా అప్పులు చేసి విద్యార్థులకు భోజనాలు పెట్టారన్నారు. వెంటనే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలనీ లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎండిఎం కార్మికులు కోరాడ చాయిదేవి, పతివాడ పైడిరాజు, పతివాడ శ్యామల పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారుల పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా సమగ్ర శిక్ష ప్రాజక్టు కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులను ఫారిన్ సర్వీస్ నిబంధనలు, షరతుల మేరకు భర్తీ చేసేందుకు అర్హత గల ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు ఆఫీస్ పని దినాలు, పని వేళల్లో సమగ్ర శిక్షా జిల్లా ప్రాజక్టు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అర్హతకు సంబంధించిన వివరాలు, దరఖాస్తు వివరాలను vizianagaram.nic.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చుని తెలిపారు. ఎఎల్‌ఎస్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి, అసిస్టెంట్ ఎఎంఒ పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలిపారు.

ఎమ్మెస్సీ స్పోర్ట్స్ కోచింగ్, పిజిడి కోర్సులకు దరఖాస్తులు స్వీకరణ

విజయనగరం టౌన్ : భారత క్రీడా ప్రాధికార సంస్థ డిప్యూటీ డైరెక్టర్, ఎన్ఎస్ఎన్‌టిఐఎస్ పటియాలా వారు 2025-26 అకడమిక్ కోసం ఎమ్మెస్సీ స్పోర్ట్స్ కోచింగ్ (2025-27), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు (2025-26) సంబంధించి స్పెషలైజేషన్‌లో ప్రవేశం కొరకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిఎస్ఒ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆసక్తి గల వారు సంబంధిత ధ్రువపత్రాలతో మే 2వ తేదీ లోగా వెబ్ సైట్ https://www.ssc.nsnis.in, https://www.ssc.nsnis. inను సందర్శించాలన్నారు. వివరాలు కోసం ఫోన్: 9491767327 ను సంప్రదించాలని తెలిపారు.

22న క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 22న జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషుల సీనియర్స్ విభాగంలో జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు విడిసిఎ కార్యదర్శి పి. సీతారామరాజు (రాంబాబు) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7:30 గంటలకు జిల్లా కేంద్రంలోని సర్ విజ్జి క్రికెట్ మైదానంలో నిర్వహించే ఎంపిక పోటీలకు క్రీడాకారులు తెలుపు డ్రెస్, సొంత కిట్టుతో హాజరుకావాలని ఆయన కోరారు. అలాగే ఆధార్ తీసుకురావాలని ఆయన తెలిపారు.

సన్మార్గంలో జీవించకుంటే కఠిన చర్యలు : ఎస్‌పి


విజయనగరం కోట : సన్మార్గంలో జీవించకుంటే కఠిన చర్యలు తప్పవని హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులను పోలీసు అధికారులు హెచ్చరించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషను పరిధిలో నివసిస్తున్న రౌడీ షీట్లు, ఇతర బ్యాడ్ క్యారక్టరు షీట్లు కలిగిన వ్యక్తులకు శనివారం ఆయా పోలీసు స్టేషన్లకు పిలిచి, మంచి ప్రవర్తన కోసం కౌన్సిలింగు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ – రౌడీ షీట్లు కలిగిన వ్యక్తుల ప్రవర్తన, వారు నిర్వర్తించే పనులు, ప్రస్తుత వారి జీవన విధానం పట్ల నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. మళ్లీ నేరానికి పాల్పడే అవకాశం ఉన్నట్లుగా వారి ప్రవర్తన ఉంటే వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని, మంచి ప్రవర్తన కోసం బైండోవరు చేయాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్‌తో జాతీయ వాష్ నిపుణులు భేటీ

విజయనగరం : జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత ఆధ్వర్యంలో జాతీయ వాష్(నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత) నిపుణులు సుధీర్‌కుమార్ బండారీ, సౌమేంద్ర రంజన్ గంగూలి శనివారం భేటీ అయ్యారు. జిల్లాలోని తమ క్షేత్రస్థాయి పరిశీలనాంశాలను కలెక్టర్‌కు వివరించారు. జాతీయ జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ వాష్ నిపుణులిద్దరూ జిల్లాలో పర్యటించారు. వారు స్థానిక ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలిసి రెండు బృందాలుగా, ఎస్‌కోట నియోజకవర్గంలోని చందులూరు, జాకేరు, దెందేరు, కింతలపాలెం, మూలబొడ్డవర, పెదఖండేపల్లి, వెల్దాం, దాంపురం గ్రామాల్లో, బాడంగి మండలంలోని లక్ష్మీపురం గ్రామంలోని తాగునీటి పథకాలు, నిర్వహణను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని నీరు మరియు పారిశుధ్య కమిటీలు, నీటి నాణ్యతా కమిటీలతో సమావేశమయ్యారు. తాము గుర్తించిన అంశాలను కలెక్టర్ కు వివరించారు. నీటి సరఫరా, పారిశుధ్యం మరింత మెరుగుపరిచేందుకు సూచనలు చేశారు. డిఈలు ఢిల్లీశ్వర్రావు, యడ్ల గోవిందరావు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో జెజెఎం పనులు పరిశీలన

బాడంగి : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో శనివారం జల జీవన్ మిషన్ పనులను జాతీయ వాష్(నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత) నిపుణులు సుధీర్‌కుమార్ బండారీ పరిశీలించారు. గ్రామంలో కుళాయి పాయింట్లు, పాఠశాలను పరిశీలించారు. ప్రతి ఇంటికీ కొళాయి వచ్చిందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి కొళాయి వల్ల కలిగే లాభాలు, నష్టాలపై ఆరాతీశారు. నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, డిఇ డిల్లేశ్వరరావు, జెఇ రాజశేఖర్, ఎంపిడిఒ రామకృష్ణ, సర్పంచ్ పాలవలస పార్వతి, ఎంపిటిసి పాలవలస గౌరు, సెక్రటరీ యోగీష్, తదితరులు పాల్గొన్నారు.




ఎస్‌డబ్ల్యుపిసిని పరిశీలిస్తున్న వాష్ నిపుణులు సుధీర్‌కుమార్

ఉపాధిపై దొంగదెబ్బ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ఒకప్పుడు కమ్యూనిస్టుల చొరవతో ఏర్పడిన ఉపాధి హామీని నేటి ప్రభుత్వాలు దొంగదెబ్బ తీస్తున్నాయి. అందుకే తొలుత నీడు, నీరు, వేసవి అలవెన్సులు లేకుండా చేసి, తాజాగా నిధుల తగ్గింపు, వేతనాల బకాయి పెంపు వరకు తీసుకెళ్లన్నాయి.' ఇది ఉమ్మడి విజయనగరం జిల్లాలో వినిపిస్తున్న పబ్లిక్ టాక్. పార్వతీపురం మన్యం జిల్లాలోని ఉపాధి కూలీలు మరో అడుగు ముందుకు వేసి మూడు రోజుల క్రితం ఏకంగా ఆందోళన బాటపట్టారు. దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన టిడిపి - జనసేన కూటమి ప్రభుత్వం నవ్విపోదురుగాక నాకేంటి అన్నట్టుగా వ్యవహరిస్తోంది. దీంతో, కూలీలను కూడా ముందుకు నడపలేని దుస్థితిలో కాదు.... కాదు... దిగజారుడు తనంతో డబుల్ ఇంజిన్ సర్కారు ఉందన్నది వేరేగా చెప్పనక్కర్లేదు. అసలే విజయనగరం జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. వ్యవసాయ ఆధారిత జిల్లా అయినా తగిన సాగునీటి వనరులు లేవు. ఈ నేపథ్యంలో 2005లో కమ్యూనిస్టుల ఒత్తిడితో కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ చట్టం ప్రకారం ఏడాదిలో వంద రోజులపాటు పని గ్యారెంటీ కల్పించాల్సివుంది. అధికారులు లేదా ప్రభుత్వ యంత్రాంగానికి నచ్చినప్పుడు కాదు సుమా..! అడిగిన వారం రోజుల్లో పని కల్పించాలి. పక్షం రోజుల్లో కూలి చెల్లింపులు జరగాలి. ఈ నిర్థిష్టమైన కాలపరిమితిలో పని కల్పించలేకపోతే ప్రభుత్వ యంత్రాంగమే కూలీలకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు కూలీలు, న్యాయ స్థానాలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వుంటుంది. ఈ విధమైన చట్టం విజయనగరం ఉమ్మడి జిల్లాకు చక్కటి వరంలా ఉపయోగపడింది. అప్పటి వరకు జిల్లాలో లెక్కకు మించిన వలసలు ఉండేవి. కానీ, చట్టం ఏర్పడ్డాక కూలీలు, వ్యవసాయ కార్మికులతోపాటు పేద, మధ్యతరగతి రైతులు, వృత్తిదారులకు చన్నీళ్లకు, వేడినీళ్ల మాదిరిగా ఉపయోగపడింది. జిల్లాలో 3.84లక్షల కుటుంబాలు కేవలం ఈ పనులపై ఆధారపడుతూ జీవనం సాగిస్తున్నారు. బహుశా అందుకేనేమో పనిదినాలు ఉపయోగించుకోవడంలో దేశానికే ఆదర్శంగా నిలిచేది. ఇందుకు గుర్తింపుగా ఎన్నోసార్లు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులు కూడా జిల్లాను వరించాయి. మరో మాటలో చెప్పాలంటే కరోనా వంటి కష్టకాలంలో కూడా కూలీల జీవనానికి ఊపిరి పోసిన చట్టం ఇది. ఈనేపథ్యంలో ఏడాదికి 200రోజులు పని, రూ.600 కనీస వేతనం వచ్చే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించాలనే ఒత్తిడి దేశ వ్యాప్తంగాను, ముఖ్యంగా మన జిల్లా నుంచి పెరిగింది. ఇటువంటి చట్టానికి బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడే తూట్లు పొడిచేందుకు ప్రయత్నించింది. అందులో భాగంగానే అప్పటి వరకు పని ప్రదేశాల్లో నీరు, నీడ కల్పన రద్దుచేసింది. టెక్నాలజీని ఉపయోగిస్తున్నామన్న పేరుతో రకరకాల ఆన్‌లైన్ పద్ధతులు, సాఫ్ట్‌వేర్లు ఉపయోగించి కూలీల శ్రమకు తగ్గవేతనం రానీయకుండా చేసింది. అంతటితో ఆగకుండా వేసవి అలవెన్సులు, గుణపాం, పార, గమేలాల సరఫరాను నిలిపివేసింది. వాటిని సొంతంగా తెచ్చుకున్నవారికి అద్దెలు ఎగ్గొట్టడం మొదలెట్టింది. ఈ చట్టానికి నిధుల కేటాయింపు కూడా తగ్గించింది.



రెండు పూటలా పనిచేస్తే తప్ప, కంప్యూటర్లు హాజరు తీసుకోని విధంగా సాఫ్ట్‌వేర్‌లను రూపొందించారు. పని నుంచి దూరం చేసేందుకు కేంద్ర ఇన్ని విన్యాసాలు చేసినా కూలీలు తాము నమ్ముకున్న నేల తల్లిని, మట్టి పనిని వదులుకోలేదు. దీంతో, మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి ఉపాధి హామీని నీరుగార్చేందుకు వేతన బకాయిలకు ఒడిగట్టింది. దేశ వ్యాప్తంగా రూ.21వేల కోట్ల బకాయి ఉండగా మన జిల్లాలో గడిచిన 100రోజుల్లో 32వేల పనిదినాలకు సంబంధించిన రూ.67.51కోట్ల మేర బకాయి ఉంచేసింది. ఇలా ఉపాధి హామీ చట్టాన్ని ఉపాధి పథకంగా మార్చేయడంతో కూలీలు తమ హక్కులన్నీ కోల్పోతున్నారు. పనిలో ఒత్తిడి పెంచినప్పటికీ అందుకు తగ్గ ఫలితం రానీయకుండా నిబంధనలు మరింత కఠిన తరం చేసింది. ఈనేపథ్యంలో రాష్ట్రంలో మన జిల్లాలోని కూలీల సగటు వేతనం రూ.164లకు దిగజారిపోయింది. కార్మికులల్లో అశాంతి, అసహనం తీవ్రతరమౌతున్న నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం ఆధ్వర్యాన వేతన బకాయితోపాటు నీరు, నీడ సదుపాయాలు పునరుద్ధరించాలని, వేధింపులు అపాలని, తగినంతగా నిధులు కేటాయించాలని, పనికి తగ్గ వేతనం అందించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి కూలీలు ఇరు జిల్లాల్లోనూ తమ ఆందోళన తీవ్రతరం చేసేందుకు సన్నద్ధమౌతున్నారు.

ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తా
మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-గంట్యాడ

గంట్యాడ మండలంలో ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని వసాది, రేగుబిల్లి, బురదపాడు, కొర్లాం గ్రామాల్లో సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొర్లాంలో రూ.60 లక్షలు, రేగుబిల్లిలో రూ.13 లక్షలు, బురదపాడులో రూ.28.50 లక్షలు, వసాదిలో రూ.35.50 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వసాది గ్రామంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణమూర్తి, తహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఐసిడిఎస్ పిఒ. ఉమాభారతి, తాటిపూడి నీటి సంఘం అధ్యక్షులు కెల్లపూడి జగన్నాథం, టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కరనాయుడు, కొప్పల వెలమ సంఘం రాష్ట్ర నాయకులు బల్ల విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్‌లో అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి-తెర్లాం

పెరుమాళి పిఎసిఎస్‌లో అక్రమాలు జరిగాయని కలెక్టర్‌కు అందిన ఫిర్యాదుపై శనివారం బొబ్బిలి సబ్‌డివిజన్ కోఆపరేటివ్ అధికారి చల్ల పద్మజ విచారణ చేపట్టారు. కమిటీ సభ్యుల సమక్షంలో విచారణ చేశారు. ఫిర్యాదుదారు శివరామరాజుతో మాట్లాడి, వివరాలు సేకరించారు. కమిటీ సభ్యులు కె.అశోక్, బస్వా హరిబాబు మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని పెట్రోల్ బంకు నిర్వహణపై అనుమానాలు వ్యక్తంచేశారు. సూపర్‌వైజర్, మేనేజర్ పాత్రపై అనుమానాలు లేవనెత్తారు. విచారణాధికారి పద్మజ మాట్లాడుతూ సూపర్‌వైజర్, మేనేజర్‌కు సమాచారం ఇచ్చినా హాజరుకాలేదని, వారిపైనా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని చెప్పారు.

సామాజిక సేవే రోటరీ లక్ష్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

సమాజంలో వెనుకబడిన, అల్పాదాయ ప్రజలకు సేవలు అందించి, వారి జీవనోపాధులను అభివృద్ధి చేయడమే రోటరీ క్లబ్ లక్ష్యమని ఆ క్లబ్ జిల్లా అధ్యక్షులు జెసి రాజు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రాంగణంలో అంతర్జాతీయ రోటరీ సంస్థ వ్యవస్థాపకులు పాల్ హారిస్ జయంతిని క్లబ్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాసన్, కార్యదర్శి సిహెచ్‌జె ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హారిస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొబ్బిలి రోటరీ క్లబ్ ప్రదేశ్ కాలంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేసిందని జెసి రాజు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ ఎలెక్ట్ కెవి శ్రీకాంత్, సూపరింటెండెంట్ అప్పలకొండ, ట్రైనింగ్ అధికారి యుగంధర్, డిటిఒ రాములప్పుడు, ప్రసాద్, త్రినాథ్, శేఖర్ పాల్గొన్నారు.

మట్టి నమూనాలు సేకరణ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని నారాయణప్పవలసలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎడి శ్యామసుందర్ మాట్లాడుతూ మండలంలో 1442 మట్టి నమూనాల లక్ష్యంగా తీసుకున్నామని చెప్పారు. మట్టి నమూనాల సేకరణను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని విఎఎలను ఆదేశించారు. తొలకరికి ముందుగా రైతులకు వాటి ఫలితాలను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాశిందొరవలస విఎఎ జి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సత్యసాయి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ అప్పారావు

కార్పొరేట్‌కు దీటుగా విద్య

ప్రజాశక్తి-బొబ్బిలి

కార్పొరేట్ కళాశాలలకు దీటుగా శ్రీసత్యసాయి జూనియర్ కళాశాలలో విద్యను అందిస్తున్నట్లు కరస్పాండెంట్ చింతా అప్పారావు తెలిపారు. ఇటీవల ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాలలో శనివారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో 28ఏళ్ల నుంచి పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో కార్పొరేట్ విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఎంసెట్, జెఇఇ మెయిన్స్‌లో మంచి ర్యాంకులు సాధిస్తున్నామని చెప్పారు. సాధారణ విద్యార్థులతో మంచి ఫలితాలు సాధిస్తున్నామని, తల్లిదండ్రులు సహకరిస్తే మరిన్ని ఫలితాలు సాధిస్తామని తెలిపారు. విశాఖ కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా విద్యను అందిస్తున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.వంశీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

'అల్ట్రాటెక్' రహదారి పరిశీలన

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలో కంటకాపల్లి, అప్పన్నపాలెం పంచాయతీల మధ్య అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీకి నరసరాజు చెరువు మీదుగా వేస్తున్న రోడ్డును ఆర్‌డిఒ కీర్తి పరిశీలించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసరాజుచెరువు గుండా అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీకి రోడ్డు వేయడాన్ని శనివారం ఆమె పరిశీలించారు. చెరువు గర్భంలో ఎంతవరకు రోడ్డు వేశారో గమనించారు. వీటి వివరాలను సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్త సుంకరపాలెం గుండా వెళ్లే మార్గాన్ని పరిశీలించి, ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.నీలకంఠారావు, ఎంపిడిఒ రమణయ్య, ఇరిగేషన్ ఎస్ఇ స్వర్ణ కుమార్, పిఆర్ ఎస్ఇ ఎం.శ్రీనివాస్, డ్వామా పీడీ శారదా దేవి, తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న ఆర్‌డిఒ కీర్తి

ఘనంగా పాఠశాల స్నాతకోత్సవం

శృంగవరపుకోట : మండలంలోని భవానినగర్‌లో ఉన్న డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్లో శనివారం ఘనంగా స్నాతకోత్సవం నిర్వహించారు. కిండర్ గార్డెన్ విద్యను పూర్తి చేసుకొని ప్రాథమిక స్థాయిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ జానకి దేవి ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు, మెడళ్లు అందజేశారు. కార్యక్రమంలో చిన్నారులు వివిధ రకాల ఆటపాటలతో అందరినీ అలరించారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దున్న ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షను ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆర్.ఈశ్వరరావు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌ను apms.apcfss.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సోమవారం ఉదయం 9 గంటలకు విదార్థులు హాల్‌టికెట్, ఆధార్ కార్డుతో ఆదర్శ పాఠశాలకు హాజరుకావాలని కోరారు.

ఎస్‌సి వర్గీకరణతో న్యాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌సి వర్గీకరణతో అణగారిన తమ కులాలకు న్యాయం జరిగిందని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు బోగి శ్రీను తెలిపారు. శనివారం స్థానిక పంచాయతీ మినిస్ట్రీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్ల ఉద్యమంలో ఆర్డినెన్స్ తెచ్చిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఆర్‌పిఎస్ సుదీర్ఘ పోరాటంతో వర్గీకరణ సాధ్యమైందని చెప్పారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనిగిరి చంటి మాదిగ, కోశాధికారి బల్లంకి కృష్ణ మాదిగ, సీనియర్ నాయకులు అలమండ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వతంగా ఇ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు


- పరిసరాల పరిశుభ్రత నిరంతర కార్యక్రమం కావాలి
- జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు
- పిఎసిఎస్, పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట, గంట్యాడ

ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాలను శాశ్వతంగా ఏర్పాటు చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు అధికారులను ఆదేశించారు. మానవాళికి ఎంతో నష్టం చేకూర్చే ఈ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. శనివారం జిల్లాలో ఆయన పర్యటించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా శృంగవరపుకోట మండల కేంద్రంలో జరిగిన ఇ-వేస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా అక్కడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్‌తో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులతో ముచ్చటించి, వారి ఆంగ్లభాషా పరిజ్ఞానాన్ని పరీక్షించారు. అక్కడినుంచి గ్రామ సచివాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఇ-వేస్ట్ సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్.కోటలో కలుషితమైన జగ్గుచెరువు, రాజచెరువులను బాగుచేయించాలని ప్రత్యేకాధికారికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిపిఒ టి.వెంకటేశ్వర్రావు, తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ సతీష్, ఇఒపిఆర్‌డి లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకుల తరహాలో పిఎసిఎస్‌లు

దాదాపు బ్యాంకుల మాదిరిగానే పిఎసిఎస్‌లను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్ బాబు చెప్పారు. శృంగవరపుకోట పిఎసిఎస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, లావాదేవీలను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నమోదు, కార్యకలాపాలపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. లావాదేవీలన్నీ ఆన్‌లైన్లోనే నిర్వహించాలని ఆదేశించారు. పిఎసిఎస్‌లకు త్వరలోనే మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. ప్రతి సభ్యుడికీ ఇ-కెవైసి పూర్తి చేయాలని, త్వరలో మెంబర్‌షిప్ డ్రైవ్‌ను నిర్వహిస్తామని తెలిపారు.



ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న అహ్మద్‌బాబు

వైద్య సేవలు మెరుగుపడాలి

ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా అందిస్తున్న సేవలను మరింత మెరుగుపర్చాలని అహ్మద్‌బాబు కోరారు. గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. మందులు ఇచ్చే గది, లేబరేటరీ, స్టాక్ రూమ్ రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. ప్రభుత్వం అత్యంత ఖరీదైన మందులను, ఆధునిక పరికరాలను ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులో ఉంచిందని చెప్పారు. వాటిని సక్రమంగా వినియోగించడం ద్వారా రోగులకు మరింత మెరుగ్గా సేవలను అందించాలని కోరారు. సిసి కెమెరాలకు మరమ్మతు చేయించాలని వైద్యాధికారులను ఆదేశించారు. చిన్నపిల్లల వైద్యుడి పోస్టును మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తనిఖీలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఎంఅండ్‌హెచ్ఒ జీవనరాణి, జిల్లా మలేరియా అధికారి మణి, ఎంపిడిఒ రమణమూర్తి, తహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, వైద్యాధికారి హేమలత, తదితరులు పాల్గొన్నారు.



కొండపేట పాఠశాలను మూసేయొద్దు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని కొండపేటలో దశాబ్దాల కాలం నుంచి ఉన్న ఎన్‌జెఎం ప్రాథమిక పాఠశాలను మూసేయకుండా కొనసాగించాలని ఆ పాఠశాల ఎస్ఎంసి కమిటి చైర్మన్ ఎం. మోనిషా, ఉపాధ్యక్షుడు టి. సూరిబాబు కోరారు. ఈ మేరకు వారు జిల్లా విద్యాశాఖాధికారికి, అమరావతిలోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు, విశాఖపట్నం రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు, స్థానిక ఎంఇఒకు, విలేకర్లకు శనివారం వినతి పత్రాలనిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 13 మంది మాత్రమే విద్యార్థులు ఉన్నారని సాకు చూపించి వచ్చే విద్యాసంవత్సరం నుంచి మూసివేతకు విద్యాశాఖాదికారులు ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమన్నారు. నెల్లిమర్లకు సుమారు 2 కిలోల మీటర్ల దూరంలో ఉన్న కొండపేటలో గత 30 సంవత్సరాలుగా జ్యూట్‌మిల్లు యాజమాన్యం ఆధ్వర్యంలో ఎయిడెడ్ పాఠశాలగా ఈ స్కూలు నడుస్తోందన్నారు. పాఠశాలను మూసివేస్తే పిల్లలు సుదూరంలోని నెల్లిమర్ల పాఠశాలలకు చంపావతి నదిని, రైలు పట్టాలను, విజయనగరం-పాలకొండ రోడ్డును దాటుకుని వెళ్లాలని తెలిపారు. ఈ పరిస్థితుల్లో పాఠశాలను మూత వేయాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు.

గురుకులాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలి

గురుకుల పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. పట్టణంలో ఉన్న గురుకుల పాఠశాలను శనివారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సొంత నిధులతో ఆర్ఒ ప్లాంట్ బాగు చేసి పిల్లలకు సురక్షితమైన తాగునీరు అందిస్తామని చెప్పారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యేలా చూస్తామన్నారు. తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులతో కమిటీ ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి నిరంతరంగా పర్యవేక్షణ చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారు, తరగతులు చెప్పేందుకు ఇబ్బందులు ఉన్నాయా? అని ప్రిన్సిపల్ రఘునాథ్‌ను అడగ్గా, గెస్ట్ టీచర్లు, సిఆర్‌టిలతో బోధన చేస్తున్నామని చెప్పారు. తాము చదువుతున్నప్పుడు ఉన్న భవనాలు మాత్రమే ఉన్నాయని, నూతన భవనాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు నారాయణమూర్తి, నాగేశ్వరరావు కోరారు.

శిశు మరణాల నివారణకు పటిష్ట చర్యలు

శిశు మరణాలు నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు చేశారు. అంగన్వాడీ సరుకులను సక్రమంగా అందించాలని ఆయన కోరారు. అంగన్వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని బేబినాయన పరిశీలించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

కోనో కార్పస్ మొక్కలను తొలగించండి

పర్యావరణానికి హామీ చేసే కోనో కార్పస్ మొక్కలను తొలగించాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. పట్టణంలోని రాణి మల్లమ్మదేవి పార్కును స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేశారు. కోనో కార్పస్ మొక్క వల్ల పర్యావరణానికి ప్రమాదమని, బొబ్బిలి మున్సిపాలిటీలో ఎక్కడ ఆ మొక్కలున్నా తొలగించి పర్యావరణానికి మేలు చేసే మొక్కలను నాటాలని ఎమ్మెల్యే కోరారు. కోనేరు గట్టుపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి, టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పతివాడ పంచాయతీ గులివిందలపేటలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను శనివారం ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజుతోపాటు మండల టిడిపి నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు ఆయన సొంత నిధులు సుమారు రూ.70 వేలు విలువైన వంటపాత్రలు, బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. పెండ్లికోసం దాసుకున్న నగదు కాలిపోయిన బాధిత కుటుంబానికి రూ. 20 వేలు నగదుతోపాటు బియ్యం, వంట సరుకులు, బట్టలు అందించారు. మిగతా ఐదు కుటుంబాలకు రూ. 3 వేలు చొప్పున ఆర్థిక సాయంతో పాటు బియ్యం, వంట పాత్రలు, బట్టలు అందజేశారు. ఆయనతోపాటు టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, గ్రామ సర్పంచ్ పైడిరాము, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పిన్నింటి శ్రీనివాసరావు, మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి సింహాచలం, క్లస్టర్ ఇంచార్జిలు సామంతుల సొంబాబు, దంగా భూలోక, కొత్తకోట వెంకటరమణ, రౌతు స్వామినాయుడు, బొంతు రవి, దువ్వు అప్పలస్వామి, చందక ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి-రాజాం

మండలంలోని బుచ్చెంపేటలో యుటిఎఫ్ ఆధ్వర్యాన శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కోండ్రుమురళీ సైతం ఈ ప్రచారంలో పాల్గొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, జిల్లా కార్యదర్శి పక్కి వాసు, వెంకటప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి వాటిని బలోపేతం చేయాలని ఎంఇఒ ఏ.రాజ్‌కుమార్ కోరారు. ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలంటూ గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గ్రామ సర్పంచ్ టొంపల సీతారాంతో కలిసి పిల్లలను పాఠశాలలో చేర్పించాల్సిందిగా తల్లిదండ్రులను కోరారు. గోవిందపురం, పాత కొప్పెర్ల, కోనాడ గ్రామాలలో కూడా ర్యాలీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు బి.నీలిమ, సూర్యనారాయణ, బంగారు నాయుడు, వెంకటేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంగర: ఐదేళ్లు నిండిన పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంఛార్జి హెచ్ఎం సిహెచ్ అప్పలరాజు కోరారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకొని ఐదేళ్లు నిండిన విద్యార్థులు పనిలో కాదు బడిలో చేరాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవిందరావు పాల్గొన్నారు.



ప్రచార కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, యుటిఎఫ్ నాయకులు

శృంగవరపుకోట : ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చేరాలని హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యాన శనివారం ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం చేశారు. ఎస్‌జిపేట, సీతంపేట, కృష్ణాపురం, పెదమధుపాడ, వేములాపల్లి, గోపాలపల్లి, రేవళ్లపాలెం, సీతారాంపురం గ్రామాల్లో పర్యటించి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. హైస్కూల్లో విద్య, సౌకర్యాలను వివరించి, పిల్లలను చేర్పించాలని కోరారు.

ఎస్‌కె కన్వెన్షన్‌ను ప్రారంభించిన జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని గర్భాంలో నూతనంగా నిర్మించిన ఎస్‌కె కన్వెన్షన్ హాల్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. వైసిపి మండల నాయకులు తాడ్డి వేణుగోపాలరావుకు సంబంధించిన ఈ కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవంలో మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి, చీపురుపల్లి సర్పంచ్ బెల్లాన శ్రీదేవి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కెవి సూర్యనారాయణరాజు, గుర్ల మండల వైసిపి అధ్యక్షులు పొట్నూరు సన్యాసినాయుడు, నాయకులు బెల్లాన బంగారునాయుడు, మెరక ముడిదాం వైసిపి అధ్యక్షులు కోట్ల వెంకటరావు, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు ఎస్‌వి రమణరాజు, బూర్లె నరేష్ కుమార్, పప్పల కృష్ణమూర్తి, కెఎస్‌ఆర్కే ప్రసాద్, తలచుట్ల హరిబాబు పాల్గొన్నారు.

సెంచూరియన్ సందర్శన

నెల్లిమర్ల : విశాఖకు చెందిన పలువురు ప్రముఖులు సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు, ఛాన్సెలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్. రాజుతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం యూనివర్శిటీలోఅమలు చేస్తొన్న కోర్సులు, ప్రయోగశాలలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలను పరిశీలించారు. ఎ.ఎస్. రాజా గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ సుగంధ, మేనేజర్ గీతా విశ్వనాధన్, సలహాదారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. యూనివర్శిటీతో కలసి కాస్మోటాలజీ కోర్సు నిర్వహించేందుకు స్వస్థ సూచన సంస్థ ముందుకు వచ్చింది. ఆ సంస్థ సిఇఒ డాక్టర్ హరిత, డాక్టర్ హేమంత్ కుమార్‌తో ముచ్చటించారు.

రాష్ట్ర ర్యాంకర్‌కు సత్కారం

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఇటీవలే విడుదలైన ఇంటర్ ఫలితాల్లో బైపిసిలో 987 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన గర్భాం ఆదర్శ పాఠశాల విద్యార్థి తాడ్డి తనూజను శనివారం గ్రామంలో మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఆదర్శ పాఠశాలకు, ఉపాధ్యాయ సిబ్బందికి, విజయనగరం జిల్లాకు, మెరకముడిదాం మండలానికి, గర్భాం గ్రామానికి గుర్తింపు తెచ్చినందుకు అభినందించారు. మునుముందు కూడా మంచి పేరు పొందాలని, తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ కళాశాలలు పరీక్షల్లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని జ్యూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. శనివారం స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ఇంటర్ పరీక్షల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి అభినందనీయమన్నారు. ముఖ్యంగా బైపిసిలో బర్ల లలిత రాష్ట్ర స్థాయిలో 989 మార్కులు సాధించడం హర్షణీయమన్నారు. కార్మికుల పిల్లల కోసం అప్పట్లో జ్యూట్ యాజమాన్యం సహకారంతో సికెఎం ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి ఎంతోమంది ఇదే కళాశాల నుంచి ఉన్నత స్థానానికి చేరుకున్నారని గుర్తు చేశారు. జరజాపుపేటకు చెందిన తాళాడ గోపాలకృష్ణ అనే పేద యువకుడు ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలకు ఎంపికయి గ్రామానికి పేరు తీసుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఆయనతో బాటు టి.అప్పల నరసయ్య, కె. పద్మనాభం పాల్గొన్నారు.

సినిమా హాల్లో తనిఖీలు

నెల్లిమర్ల : ఆర్‌డిఒ ఆదేశాలు మేరకు స్థానిక తహశీల్దార్ సుదర్శనరావు నెల్లిమర్ల సినిమా థియేటర్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ప్రేక్షకుల సౌకర్యాలు, యజమాని నియమ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రేక్షకులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-వంగర

మండలంలోని నీలయ్య వలస నుండి రేగిడి మండలం కొండవలస సెంటర్ వరకు రూ.3కోట్లతో చేపడుతున్న బిటిరోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ నీలయ్యవలస వద్ద శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత కూటమి ప్రభుత్వం దేనని అన్నారు. అర్హులైన వారందరికీ త్వరలోనే ఇళ్ల మంజూరు చేస్తామన్నారు. తాగు, సాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని కొప్పర, కొత్తవలస, ఎం సీతారాంపురం గ్రామాలలో పలువురిని పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పిన్నింటి మోహనరావు, లచ్చుబుక్త కృష్ణమూర్తి, వాసుదేవరావు నాయుడు, పైల వెంకటరమణ బెజ్జిపురం రవి, గణపతి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

రెండు కేజీల గంజాయితో యువకుడు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని గూడ్స్ షెడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా స్కూటీపై వస్తున్న ఓ యువకుడు పోలీసులను చూసి ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో 1వ పట్టణ ఎస్ఐ వి.ఎల్ ప్రసన్న కుమార్ ఆధ్వర్యాన సిబ్బంది అతడిని పట్టుకుని తనిఖీ చేయగా సుమారు రెండు కేజీల గంజాయి ప్యాకెట్లు దొరికింది. నిందితుడిని నగరంలోని శాంతినగర్‌కు చెందిన వాసుపల్లి విజయ్ గా గుర్తించారు. రెవిన్యూ అధికారుల సమక్షంలో గంజాయిని, స్కూటీని సీజ్ చేసి, కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

అధికారులు సరే.. సభ్యులేరీ?

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- రేగిడి

పూర్తిస్థాయిలో సభ్యులు హాజరు కాకపోవడం సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపిపి దార అప్పలనరసమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన ఈ సమావేశంలో కోరం అయినా వెంటనే సమావేశం ప్రారంభించారు. సర్పంచులు కొంతమంది హాజరుకాగా, మరి కొంతమంది కొన్ని శాఖల సమీక్ష పూర్తయిన తర్వాత వచ్చారు. దీంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. గత సర్వసభ్య సమావేశంలో గ్రామ సమస్యలపై ఎన్ని సమస్యలు పరిష్కరించారో సభ్యులు అధికారులకు లేవనెత్తలేదు. వ్యవసాయ శాఖ సమీక్షలో ఎఒ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ వ్యవసాయానికి రైతులకు స్పందన, 1121, స్వర్ణ, ఆర్‌జేయల్, సాంబ మాసూరు వంటి విత్తనాలకు నివేదికలు పంపించామన్నారు. కొంతమంది రైతులకు పిఎం కిసాన్ రైతు ఖాతాలో జమ కాలేదని సభలో సభ్యులు అడిగారు. దీనిపై ఎఒ స్పందించి మాట్లాడుతూ కుటుంబంలో ఒక్కరికే పిఎం కిసాన్ అందుతుందని తెలిపారు. ఈ క్రాప్ బుకింగ్ ఎవరైతే చేస్తారో వారికే అన్ని రకాల పథకాలు వర్తిస్తాయన్నారు. విద్యుత్ శాఖ సమీక్షలో ఎఇ సురేష్ మాట్లాడుతూ లో వోల్టేజ్ సమస్య ఉంటే పరిష్కరిస్తామన్నారు. సూర్య ఘర్ పథకంలో రాయితీతో అర్హులకు సోలార్ విద్యుత్తు అందజేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. డిటి రామారావు మాట్లాడుతుండగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అడ్డుపడుతూ భూ రీసర్వేలో రైతుల నుంచి ఎన్ని సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని సమస్యలు పరిష్కరించారు? ఎన్ని పరిష్కరించలేదో జాబితా తయారు చేసి ఇవ్వాలన్నారు. రేషన్ లబ్ధిదారులకు ఇకెవైసి తక్షణమే చేయించాలని సూచించారు. ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ మాట్లాడుతూ 2024-25 ఏడాదికి 17,650 జాబు కార్డులకు గాను 13,255 మంది ఉపాధి కూలీలకు పనులు కల్పిస్తూ 19.30 కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. ఎమ్మెల్సీ కలుగజేసుకుని ఈ ఏడాది ఉపాధి కూలీలు చెల్లించారా అన్న ప్రశ్నకు జనవరి చివరినాటి నుంచి ఏప్రిల్ 19 వరకు కూలీలకు జమ కాలేదన్నారు. సుమారు 22 కోట్ల రూపాయలు రావాల్సి ఉందని తెలిపారు. చిన్నశిర్లాం ఫీల్డ్ అసిస్టెంట్ విచారణ ఏమైందని ప్రశ్నించగా పీడీకి నివేదికలు అందించామన్నారు. వెలుగు, గృహ నిర్మాణం, విద్యాశాఖ, మడ్డవలస అంగన్వాడి ఇతర శాఖలపై నామా మాత్రం చర్చ జరిగింది. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, ఎంపిడిఒ శ్యామల కుమారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పిల్లలు, గర్భిణులకు ప్రమాదం

- స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జోనల్ ప్రత్యేకాధికారి రాజశేఖర్
- జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్,విలేకర్ల బృందం

ఇళ్లు, కార్యాలయాలు, వాణిజ్య, వ్యాపార సంస్థల్లో పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులను శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించడం ఎంతో ముఖ్యమని ఉత్తరాంధ్ర జిల్లాల ప్రత్యేక అధికారి, రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. ఈ వ్యర్థాలను సరైన రీతిలో తొలగించకపోతే వాటి నుంచి వెలువడే రసాయనాలు పిల్లలు, గర్భిణీలకు ఎంతో ప్రమాదకరంగా పరిణమిస్తాయని చెప్పారు. ఇ-వ్యర్థాలను శాస్త్రీయ విధానంలో తొలగిస్తే వాటి నుంచి వెయ్యిరకాల ప్రమాదకర రసాయనాలు వెలువడతాయని, వాటిని పీల్చిన గర్భిణులకు, వారి గర్భంలోని శిశువుకు ఇవి ఎంతో హాని కలిగిస్తాయన్నారు. ప్రజల్లో ఇ-వ్యర్థాల పై అవగాహన తక్కువగా వుందని, ఈ లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇ- వ్యర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, వాటిని సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించేందుకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మూడో శనివారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ శాఖలు, కళాశాలలు ఆధ్వర్యాన అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అందులో భాగంగా నగర పాలకసంస్థ ఆధ్వర్యంలో ఇ-వ్యర్థాలపై నగరంలో శనివారం నిర్వహించిన ర్యాలీలో జోనల్ ప్రత్యేక అధికారి బి.రాజశేఖర్, జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పాల్గొన్నారు. పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి కోట వరకు నిర్వహించిన ర్యాలీలో వారు విద్యార్థులు, మహిళలతో కలసి పాల్గొన్నారు. అనంతరం కోటవద్ద విద్యార్థులు, మహిళలతో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి బి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 2022 నాటికి 8 కోట్ల టన్నుల ఇ-వ్యర్థాలు వున్నట్టు ప్రపంచ ఆరోగ్యసంస్థ తన నివేదికలో వెల్లడించిందని,ఇది మానవాళి మనుగడకే ప్రమాదకరమన్నారు. ఇ-వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగిస్తే వాటి నుంచి ఎంతో విలువైన బంగారం, వెండి, ప్లాటినం వంటి లోహాలను వెలికి తీయవచ్చన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కోట వద్ద ఏర్పాటు చేసిన ఇ-వ్యర్థాల సేకరణ కౌంటర్‌ను ప్రత్యేక అధికారి పరిశీలించారు. వాటిని ఎక్కడకు తరలించేదీ కమిషనర్ ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఆర్‌డిఒ కీర్తి, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణచక్రవర్తి, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ బిబి సరిత తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మను దర్శించుకున్న ప్రత్యేక అధికారి

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ముందుగా జిల్లాపరిషత్ అతిథిగహానికి చేరుకున్నారు. అక్కడ జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని దర్శించారు. ఆలయం వద్ద కార్యనిర్వహణ అధికారి కె.ఎన్.వి.డి.వి. ప్రసాదరావు స్వాగతం పలికారు



విజయనగరంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న ఉత్తరాంధ్ర ప్రత్యేకాధికారి రాజశేఖర్, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, అధికారులు, ఉద్యోగులు, తదితరులు



శృంగవరపుకోటలో ర్యాలీలో పాల్గొన్న జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



భోగాపురంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగమాధవి, అధికారులు



బొబ్బిలిలో పార్కులో చెత్త ఊడ్చుతున్న ఎమ్మెల్యే బేబినాయన



రామభద్రపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌డిఒ రామ్మోహనరావు, తదితరులు



రాజాంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్



సీతం కళాశాలలో సేకరించిన ఇ-వ్యర్థాలు



బాడంగిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు




నెల్లిమర్లలో ర్యాలీలో పాల్గొన్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు, అధికారులు



విజయనగరం డిఎంహెచ్ఒ కార్యాలయంలో సేకరిస్తున్న ఇ-వ్యర్థాలు



వేపాడలో ర్యాలీ చేపడుతున్న అధికారులు



చీపురుపల్లిలో ర్యాలీ చేపడుతున్న అధికారులు



వంగరలో ర్యాలీ చేపడుతున్న అధికారులు